క్లుప్తంగా

రామలింగేశ్వరుడికి జలాభిషేకం

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని రామస్వామిగుట్టపై వెలిసిన రామలింగేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం త్రివేణి సంగమ జలాలతో శివలింగానికి అభిషేకం చేశారు. ఇటీవల అయోధ్యకు వెళ్లిన భక్తులు కృష్ణ, గణేష్, అంజి, మహేందర్, గోవింద్‌రెడ్డి, రామకృష్ణ, ప్రవీణ్ తదితరులు కాశీ సమీపంలోని త్రివేణి సంగమం నుంచి జలాలు తెచ్చి ఆలయంలో అభిషేకం, పూజలు చేశారు.

మునిరంగస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే



భూత్పూర్: మండల కేంద్రంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న మునిరంగస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బ్రహ్మోత్సవాల కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువతో సత్కరించారు.

ఆస్తిపన్ను వడ్డీపై 90శాతం రాయితీ

జడ్చర్ల టౌన్: ఆస్తి పన్ను వడ్డీపై 90శాతం రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని మున్సిపాలిటీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ రాజయ్య బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 31 వరకు ఈ సదుపాయం ఉందని, బకాయిలు కలిగిన వారు అవకాశం వినియోగించుకోవాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

భూత్పూర్: మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రభాకర్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు సమావేశ మందిరంలో ఉంటుందని సభ్యులు, అధికారులు, విధిగా హాజరుకావాలని ఎంపీడీఓ పేర్కొన్నారు.

ఎంపీని కలిసిన మండల నాయకులు

నవాబుపేట: మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డిని ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడంపై బుధవారం పార్టీ శ్రేణులు హైదరాబాద్‌లో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, నర్సింహులు సన్మానం చేసి పూలబొకె అందించారు. వచ్చే ఎన్నికలలో గతంలో మాదిరిగా కలిసికట్టుగా పనిచేసి ఎంపీగా గెలిపించేందుకు ప్రతి కార్యకర్తల సిద్ధంగా ఉన్నారని వారు వివరించారు.

బేసిక్ పే వ్యత్యాసం తగ్గించండి

మహమ్మదాబాద్: బేసిక్ పే సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు, స్కూల్ అసిస్టెంట్‌లకు మధ్య వ్యత్యాసం చాలా ఉందని, తగ్గించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాంచందర్‌రాథోడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌భూషణ్ బుధవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం వేసిన రెండవ వేతన సవరణ సంఘాన్ని కోరుతున్నట్లు తెలిపారు.

రోడ్డు పనులు ప్రారంభం

మహమ్మదాబాద్: మండల కేంద్రంలో సీసీ రోడ్ల పనులను డీసీసీ మాజీ అధ్యక్షుడు కమతం శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ఎంపీటీసీ

గండేడ్: పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో బుధవారం మండలంలోని రంగారెడ్డిపల్లి ఎంపీటీసీ శైలజా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీత, జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ధ్రువపత్రాల ప్రదానం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో వాణిజ్యశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు మేకింగ్ టైం సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు డిజిటల్ మార్కెటింగ్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కార్యక్రమం ముగింపు రోజు బుధవారం విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత టెక్నాలజీ ఇంటర్నెట్ అనుసంధానం కావడంతో మార్కెటింగ్ అంతా కూడా డిజిటల్ విధానంలో జరుగుతుందన్నారు.

రోడ్డుకు అడ్డంగా డబ్బాలను తొలగించండి

మిడ్జిల్: మండల కేంద్రంలో 2వ వార్డులో రోడ్డుకు అడ్డంగా వేసిన డబ్బాలను తొలగించాలని 2వ వార్డుకు చెందిన ప్రజలు బుధవారం ఎంపీడీఓ కార్యాలయం దగ్గర పంచాయతీ కార్యదర్శి సాయన్నకు వినతిపత్రం ఇచ్చారు. డబ్బాలతో అభివృద్ధి పనులలో భాగంగా సీసీ రోడ్డు మంజూరైందని, పనులు ఆగిపోయే అవకాశం ఉన్నందున డబ్బాలను తొలగించాలని కోరారు. చంద్రకళ, కృష్ణయ్య, వెంకటయ్య, మంగమ్మ, రాణి ఉన్నారు.

నిఘా నీడలో పాలమూరు



మాట్లాడుతున్న డీఐజీ చౌహాన్

- 1,300 మందితో సీఎం పర్యటనకు బందోబస్తు
- పోలీస్ సిబ్బందికి విధులపై సూచనలు చేసిన డీఐజీ ఎల్.ఎస్ చౌహాన్

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ మైదానంలో నిర్వహించిన సీఎం సభకు బందోబస్తును జోగుళాంబ జోన్–7 డీఐజీ ఎల్.ఎస్ చౌహాన్ పర్యవేక్షించారు. ముందుగా వేదిక, గ్యాలరీలు, సభా స్థల ప్రాంగణం పరిశీలించారు. మొత్తం ఇద్దరు అదనపు ఎస్పీలు, 12మంది డీఎస్పీలు, సీఐలు 33, ఎస్ఐలు 60, ఏఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్స్ 168, కానిస్టేబుల్స్ 593, మహిళ కానిస్టేబుల్స్ 149, హోంగార్డులు 124, ఆరు స్పెషల్‌పార్టీ టీంలు, 100మంది బీడీ టీం బలగాలు విధులు నిర్వహించారు. బందోబస్తుపై డీఐజీ, ఎస్పీ హర్షవర్ధన్‌లు ఫంక్షన్‌హాల్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించి సిబ్బందికి సూచనలు చేశారు. డీఐజీ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, ట్రాఫిక్‌ను మళ్లించాలన్నారు. విధుల్లో ఉన్న పోలీసులు సంయమనం పాటించాలని, సభ స్థలంతో పాటు రోడ్లపై ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. సమావేశంలో శిక్షణ ఐపీఎస్ అధికారి చిత్తరంజన్, అదనపు ఎస్పీలు రాములు, సురేష్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో జిల్లా కేంద్రంలోని స్టేడియంలో దిగారు. ఆ తర్వాత రోడ్డు మార్గంలో ఎంవీఎస్ మైదానానికి చేరుకున్నారు. ఈ క్రమంలో స్టేడియం దగ్గర నుంచి ఎంవీఎస్ వరకు రోడ్డుకు ఇరువైపులా పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఆ తర్వాత వెళ్లే సమయంలో క్రిస్టియన్‌పల్లి నుంచి బైపాస్ రోడ్ మొత్తం పోలీస్ బలగాలు పహారా కాశారు.

సీఎం సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



అప్పంపల్లి నుంచి తరలివెళ్తున్న నాయకులు

దేవరకద్ర: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో బుధవారం సీఎం పాల్గొన్న ప్రజాదీవెన బహిరంగ సభకు దేవరకద్ర, కౌకుంట్ల మండలాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత మొదటిసారిగా జిల్లా కేంద్రానికి రావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం జోష్ నెలకొంది. దేవరకద్ర నాయకులు అంజన్‌కుమార్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఆదిహన్మంతరెడ్డి, జవహర్, వేణుగోపాల్, నర్వశ్రీనివాస్‌రెడ్డి, బీసు నర్సింహారెడ్డి, వర్మ, చారి, రాంపాండు పలువురు తరలి వెళ్లారు.

చిన్నచింతకుంట: పాలమూరు ప్రజాదీవెన సభకు మండలంలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బుధవారం భారీగా తరలి వెళ్లారు. చిన్నవడ్డేమాన్, అప్పంపల్లి, దాసర్‌పల్లి, దమగ్నాపూరం, నెల్లికొండి నుంచి పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు.

నవాబుపేట: జిల్లా కేంద్రంలో ప్రజాదీవెన సభకు బుధవారం మండలం నుంచి తరలివెళ్లినట్లు కాంగ్రెస్ నాయకులు రాంచంద్రయ్య, అజహర్, రాజేష్ తెలిపారు. వాసుయాదవ్, వెంకటేష్‌గౌడ్, భూపాల్‌రెడ్డి, శ్రీహరి, ఆంజనేయులు, కుమార్, రాజు, రామకృష్ణ, రమేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



రాజాపూర్లో చిత్రలేఖన పోటీల్లో ఉపాధ్యాయులు



రీజియన్ కార్యాలయంలో వేడుకల్లో పాల్గొన్న మహిళా ఉద్యోగులు

అడ్డాకుల: మహిళలు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరముందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సతీమణి కవిత అన్నారు. మూసాపేట మండలం వేముల శివారులోని ఎస్‌జీడీ ఫార్మా పరిశ్రమలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు సంతోషి, శకుంతల, విజయలక్ష్మి, లత, పరిశ్రమ నిర్వాహకులు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు చిత్రలేఖన పోటీలు..

రాజాపూర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మహిళా ఉపాధ్యాయులకు మండల స్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఇంటర్‌నేషనల్ డెమోక్రసి అంశంపై పోటీలు నిర్వహించడంతో 14 మంది పాల్గొన్నట్లు హెచ్‌ఎం ఆనంద్ పేర్కొన్నారు. మొదటి బహుమతి సుజాత, రెండో బహుమతి ప్రవీణ, మూడో బహుమతి పద్మవతి గెలుచుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. మొదటి, రెండవ స్థానాలు గెలుపొందిన వారు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

ఆర్టీసీలో మహిళా దినోత్సవం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ రీజియన్ కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆర్‌ఎం శ్రీదేవి మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ అభివృద్ధిలో మహిళా ఉద్యోగుల పాత్ర ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్, డిప్యూటీ ఆర్‌ఎంలు శ్యామల, లక్ష్మీదుర్గ, డీఎం సుజాత తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: అన్నిరంగాల్లో మహిళలు శక్తివంతం కావడంతోపాటు ఆత్మగౌరవంతో జీవించాలన్నదే బీజేపీ ప్రభుత్వ లక్ష్యం అని పార్టీ రాష్ట్ర నాయకురాలు పద్మజారెడ్డి అన్నారు. బుధవారం దేవరకద్రలో జరిగిన నారీ శక్తివందన్ కార్యక్రమంలో మోదీ ప్రసంగాన్ని ఎల్‌ఈడీ స్క్రీన్‌పై మహిళలతోపాటు ఆమె వీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడమే మోదీ సంకల్పం అన్నారు. నిరుపేద కుటుంబాల కష్టాలను తీర్చే దిశగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మహిళల ఆత్మగౌరవం కాపాడేందుకు ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మాణం, కట్టెల పొయ్యి కష్టాలు తీర్చి ఉజ్వల గ్యాస్ కనెక్షన్ ఇచ్చి ఆదుకున్నది మోదీనే అని పేర్కొన్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ముద్ర లోన్స్ కింద డ్వాక్రా రుణాలు ఇస్తున్నారని, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ తీసుకొచ్చింది బీజేపీ ప్రభుత్వమేనని వివరించారు. ఉద్యోగ, వ్యాపార రంగాలతోపాటు యుద్ధ రంగంలోనూ మహిళలకు ప్రాధాన్యత కల్పించిన ఘనత మోదీకి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండా ప్రశాంత్‌రెడ్డి, నాయకులు రమేశ్, దేవన్న, రాజు, కృష్ణంరాజు పాల్గొన్నారు.

'పాలమూరు-రంగారెడ్డి' పనులు వేగవంతం చేయాలి

- డబుల్ బెడ్‌రూం ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు ఇవ్వండి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు వేగవంతం చేసి నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు, కార్యదర్శివర్గ సభ్యుడు కిల్లె గోపాల్ కోరారు. బుధవారం మహబూబ్‌నగర్‌కు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదండాపూర్ రిజర్వాయర్‌లో సర్వం కోల్పోయిన నిర్వాసితులకు బీఆర్‌ఎస్ హయాంలో సరైన న్యాయం కాలేదన్నారు. ఈ ప్రాజెక్టు పరిధిలోని అన్ని రిజర్వాయర్లను పూర్తి చేయడంతో పాటు పంట పొలాల వరకు కాల్వలు నిర్మించి జిల్లా సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలన్నారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల నియోజకవర్గాల పరిధిలో కొన్ని చోట్ల డబుల్ బెడ్రూం ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. పూర్తయిన చోట అర్హులకు కేటాయించడంలో పారదర్శకత పాటించలేదన్నారు. ఇప్పటికైనా ఇందిరమ్మ పథకంలో పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, అవసరమైన వారికి స్థలం కేటాయించాలన్నారు. పదేళ్లుగా కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో పేదలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే దరఖాస్తుకున్న వారికి వెంటనే రేషన్ కార్డులు ఇవ్వాలన్నారు.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో వేలం

అడ్డాకుల: మండలంలోని కందూర్ సమీపంలో రామలింగేశ్వరస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో బుధవారం వేలం నిర్వహించారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వీణాధరి, ఈఓ రాజేశ్వరశర్మ, జూనియర్ అసిస్టెంట్ అనంతసేన్‌రావుతో పాటు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో వేలం ఏర్పాటు చేశారు. కొబ్బరికాయల విక్రయాన్ని మురళీ రూ.10లక్షలకు దక్కించుకున్నారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాన్ని కట్ట మల్లేష్ రూ.7.65లక్షలకు, తలనీలాల సేకరణను రామన్‌గౌడ్ రూ.1.05లక్షలకు దక్కించుకున్నారు. కొబ్బరి చిప్పల సేకరణను రూ.28వేలకు ఆంజనేయులు వేలంలో పొందారు.

ఇంటింటికీ క్యాలెండర్ల పంపిణీ

జడ్చర్ల టౌన్: పట్టణంలోని 10, 11 వార్డుల్లో లాబర్తి సంపర్క అభియాన్ లబ్ధిదారులకు ప్రధాని మోడీ క్యాలెండర్లను బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ బుధవారం సాయంత్రం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నరేంద్రమోడీని మరోసారి ఆశీర్వదించాలని, బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాగరాజు, రాజశేఖర్‌రెడ్డి, మధు, సాహితిరెడ్డి, కొంగలి శ్రీకాంత్ పాల్గొన్నారు.

యాదవ సంఘం ఎన్నిక

జడ్చర్ల టౌన్: మండలంలోని వల్లూరులో శ్రీకృష్ణ యాదవ సంఘం అధ్యక్షుడిగా చెన్నయ్య, ఉపాధ్యక్షుడుగా చిన్న సంజీవ, కార్యదర్శి మల్లేషులు ఎన్నికయ్యారు. బుధవారం గ్రామంలో సమావేశం నిర్వహించారు.

శివాలయంలో వార్షికోత్సవం

దేవరకద్ర: మండలంలోని పెద్ద గోప్లాపూర్‌లో బుధవారం శివాలయంలో ఐదవ వార్షికోత్సవం నిర్వహించారు. శివాలయంలో అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పూలతో స్వామి వారిని అలంకరించారు. దేవాలయంలో విఘ్నేశ్వర పూజ, నవగ్రహ పూజ, హోమం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలతో గ్రామం అంతా శివనామ స్మరణతో మార్మోగింది. అనంతరం దేవాలయం వద్ద అన్నప్రసాదాలను భక్తులకు అందజేశారు.

ముందస్తు అరెస్టులు

మిడ్జిల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా మండలంలోని ప్రతిపక్ష పార్టీలు ఆందోళన చేపట్టే అవకాశం ఉండడంతో ముందస్తు అరెస్టులు చేశారు. ఎస్ఐ ఆనంద్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌కు చెందిన ఎంపీపీ సుదర్శన్, బాలు, భీంరాజ్, శ్రీకాంత్, బీజేపీ నాయకులు తిరుపతి, నరేందర్, శేఖర్‌ను అరెస్టు చేసి స్టేషన్‌లో ఉంచారు.

జింక్ లోపంతో దిగుబడి తగ్గే అవకాశం

రాజాపూర్: యాసంగిలో జింక్ లోపం మూలంగా వరిలో పంట దిగుబడి తగ్గుతుందని, వరి పైర్లను రక్షించుకోవాలని ఏఓ నరేందర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ముదిరెడ్డిపల్లిలో రైతులు సాగు చేసుకున్న వరి పైర్లను పరిశీలించి జింక్‌లోపాన్ని గుర్తించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాన పొలంలో జింక్ ధాతులోపం గమనించినట్లయితే లీటరు నీటికి 2గ్రాముల జింక్ సల్ఫేట్‌ను ఐదు రోజుల వ్యవధిలో రెండు మూడు సార్లు పిచికారి చేసుకోవాలన్నారు. జింక్ లోపం వల్ల వరిలో ఆకుల తేడాను గమనించవచ్చన్నారు. అంతేకాకుండా వ్యవసాయ శాఖ అధికారులు ఇచ్చిన సూచనలు పాటించాలన్నారు.

నేటి నుంచి ఉత్సవాలు

- ముస్తాబైన మీనాంబరం పరశువేదీశ్వర ఆలయం
- కృతాయుగం చివర–త్రేతాయుగం ఆరంభంలో నిర్మించిన ఆలయం



దుందుభీతీరాన ఉన్న మీనాంబరం పరశువేదీశ్వరస్వామి ఆలయం



ఆలయంలో అతిపెద్ద పానపట్టు కలిగిన శివలింగం

జడ్చర్ల టౌన్: మండలంలోని కుర్వగడ్డపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న మీనాంబరం పరశువేదీశ్వర ఆలయంలో మహాశివరాత్రి పురస్కరించుకుని బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఐదురోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఆలయం కృతాయుగం చివర త్రేతాయుగం ఆరంభంలో నిర్మించినట్లుగా చరిత్ర చెబుతుంది. పరశురాముడు దుందుభీనది తీరాన ఇసుకతో లింగం చేసి ప్రతిష్ఠించాడని ప్రతీతి. పరశురాముడు స్పర్శతో ప్రతిష్టించిన లింగం కావటంతో పరశువేదీశ్వరుడుగా శివుడిని కొలుస్తుంటారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో పడమరవైపు ముఖద్వారం ఉన్న 17 శైవక్షేత్రాల్లో ఇది ఒకటి. అంతేకాకుండా అతిపెద్ద పానువాటం కలిగి ఉన్న ఆలయాల్లో ఒకటి.

చేపలు అంబరాన్ని తాకటంతో మీనాంబరంగా నామకరణం..

నలచక్రవర్తి దమయంతితో కలిసి అరణ్యవాసంలో కాలం గడుపుతూ దుందుభీ నది తీరానికి వచ్చారు. నదిలో నలచక్రవర్తి చేపలు పట్టి వండమని దమయంతికి ఇచ్చాడట. ఆమె వాటిని అదే నది తీరాన వండి ఉడికాయా లేదా అని పరిశీలించేందుకు అక్కడే ఉన్న కట్టెపుల్లతో కలపగా ఉడికిన చేపలన్నీ జీవం పోసుకుని వంటపాత్ర నుంచి బయటకు వచ్చి ఆకాశమంత ఎత్తుకు ఎగిరి నదిలో పడిపోయాయట. చేపలు (మీనం) అంబరాన్ని తాకటంతో ఈ ప్రాంతానికి మీనాంబరంగా పేరు ప్రసిద్ధిగాంచింది. అయితే ఔరంగజేబు హయాంలో ఆలయం ధ్వంసం కాగా ఇప్పుడిప్పుడే పూర్వవైభవం తీసుకువచ్చేందుకు ఆలయ అభివృద్ధి కమిటీ ప్రయత్నిస్తుంది. శిథిలమైన ఆలయాన్ని 1959లో గంగాపూర్ చెందిన గంధం రామచంద్రయ్య బాగు చేయించి అరుగులు కట్టించారు. ప్రస్తుతం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆలయం ప్రాకారం నిర్మించటంతోపాటు మెట్లు, నవగ్రహాలు, గంట, ధ్వజస్తంభం ప్రతిష్టాపన చేశారు.

నేటినుంచి బ్రహ్మోత్సవాలు..

ఉత్సవాల్లో భాగంగా గురువారం పుణ్యాహవాచనం, కంకణధారణ, నిత్యపూజలతో పాటు కలశ స్థాపన చేయనున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్మించిన గోశాల ప్రారంభించనున్నారు. శుక్రవారం భక్తులచే అభిషేకాలు, రాత్రి శివపార్వతుల కల్యాణం, శనివారం రథోత్సవం, ఆదివారం శకటోత్సవం, సోమవారం చక్రతీర్థంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

ఎల్‌ఆర్‌ఎస్ పేరుతో ప్రజలపై భారం



జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎల్‌ఆర్‌ఎస్ పేరుతో పేద ప్రజలపై భారం మోపుతుందని మాజీ మున్సిపల్ చైర్మన్ నర్సింహులు ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు తాము అధికారంలోకి వచ్చాక ఉచితంగా క్రమబద్ధీకరణ చేపడుతామని చెప్పి ప్రస్తుతం అధికారంలోకి వచ్చాక మాటతప్పారని ఆరోపించారు. ప్రభుత్వమే ఉచితంగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కోర్టుల్లో కేసులు వేసి ఎల్‌ఆర్‌ఎస్‌ను నిలుపుదల చేశారని, ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం పేదల నడ్డి విరిచే చర్యలకు పూనుకుంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతుందన్నారు. ఉమ్మడి జిల్లాల పరిధిలో 1.95 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటన్నింటిని హామీ ఇచ్చిన మేరకు ఉచితంగా క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. మార్చి 31 లోగా డబ్బులు కట్టాలని ప్రజలపై ఒత్తిడి తెస్తున్నారని, ఇది ఎంతమాత్రం తగదన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ ఉచితంగా చేయాలి..

జడ్చర్ల: ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా చేయాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చి ఎల్‌ఆర్‌ఎస్‌కు ఫీజు వసూలు చేస్తామని చెప్పడం తగదని జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య తెలిపారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.

అడ్డాకుల: భూ క్రమబద్ధీకరణ పథకం(ఎల్‌ఆర్‌ఎస్) చార్జీలను ప్రజల నుంచి వసూలు చేయొద్దని బీఆర్‌ఎస్ మండల నాయకులు డిమాండ్ చేశారు. మూసాపేట మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం జెడ్పీటీసీ సభ్యుడు ఇంద్రయ్యసాగర్, పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మినర్సింహ్మా, విండో అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు మదీనా జమీర్, భాస్కర్‌గౌడ్, శివరాములు, రవిగౌడ్‌లు విలేకరులతో మాట్లాడారు.

భూత్పూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేయడానికి, ఆదాయం రావడానికే ఎల్‌ఆర్‌ఎస్ స్కీంను తెరపైకి తెచ్చిందని ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి ఆరోపించారు. పట్టణంలో మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత మేనిఫెస్టోను నమ్మొద్దని, గ్రామాల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీపై విసుగు చెందారని ఎంపీపీ పేర్కొన్నారు.

టీఎస్‌మిసా జిల్లా కార్యవర్గం ఏర్పాటు



నియామకపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఉద్యోగుల సర్వీస్ సంఘం (టీఎస్‌మిసా) జిల్లాశాఖ కార్యవర్గాన్ని మంగళవారం రాత్రి జిల్లా కేంద్రంలో రాష్ట్ర ప్రతినిధులు గౌస్ మొహియొద్దీన్, డాక్టర్ మక్బూల్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మంజూర్‌అలీ, ప్రధాన కార్యదర్శిగా ఎంఏ.ఖయ్యూం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహ్మద్ ఫరీదుద్దీన్, అదనపు ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ మక్బూద్‌అలీ, కోశాధికారిగా అబ్దుల్ హాజీ, ఉపాధ్యక్షులుగా అబ్దుల్ ఖాదర్, షౌకత్‌అలీ, అహ్మద్‌ఖాన్, సలీంఖాన్, ఏఎస్.హీరాం, సాలేహాబేగం, సంయుక్త కార్యదర్శులుగా అబ్దుల్ రహీం, మహ్మద్ హాది, మహ్మద్ యూనుస్, హనీఫ్‌ఖాన్, ఇనాయతుల్లా, నస్రీన్ సుల్తాన్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎంఏ.రవూఫ్, ఇలియాజ్, ఎంఏ.సలీం, ఎజాజ్ అహ్మద్, రియాజ్, మహిళా కార్యదర్శిగా నూర్‌జహా బేగంలను ఎన్నుకున్నారు. ఉద్యోగుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తామని తెలిపారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



మిడ్జిల్ మండలం వేములలో..



దేవరకద్ర మండలం చౌదర్‌పల్లిలో..

మిడ్జిల్: మండలంలోని వేముల ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తరగతి గదులలో బోధన చేశారు.

నవాబుపేట: మండలంలోని లింగంపల్లి పాఠశాలలో బుధవారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు.

దేవరకద్ర: మండలంలోని చౌదర్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం అభినందన సభలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులను అందజేశారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



బుర్రవీణ వాయిద్యం ప్రదర్శిస్తున్న పద్మశ్రీ దాసరి కొండప్ప

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో సేవా భారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాందీపని ఆవాసం 19వ వార్షికోత్సవాన్ని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముందుగా భరతమాత, సరస్వతీదేవి చిత్రపటాలకు పూజలు నిర్వహించి విద్యార్థుల ప్రార్థనలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యవక్తగా పాల్గొన్న ఆర్‌ఎస్‌ఎస్ దక్షిణభారత క్షేత్ర సహ ప్రచార్ శ్రీరాంభరత్‌కుమార్ మాట్లాడుతూ సమాజంలో అనేక మందికి ఏదో ఒక రకంగా సేవలు చేయాలనే తపన ఉంటుందన్నారు. సేవాభారతి ఆధ్వర్యంలో సాందీపని ఆవాసాన్ని నిర్వహిస్తుండడం అభినందనీయమని అన్నారు. అనంతరం పద్మశ్రీ అవార్డు గ్రహీత దాసరి కొండప్ప బుర్రవీణ వాయిద్యాన్ని ప్రదర్శించి అలరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో న్యాయవాది మనోహర్‌రెడ్డి, సుబ్బయ్య, ఏమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరెడ్డి, శరవన్న, ప్రసాద్, దుర్గారెడ్డి, వసంతం వెంకటేశ్, కాశీనాథ్‌తోపాటు బీజేపీ నాయకులు డీకే అరుణ, జితేందర్‌రెడ్డి, మిథున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: జిల్లాలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. బుధవారం జిల్లా కేంద్రంలో ప్రజాదీవెన బహిరంగ సభలో పాల్గొనేందుకు వచ్చిన ముఖ్యమంత్రిని కలిశారు. మూడు నెలలుగా ఇసుక కొరత మూలంగా భవన నిర్మాణ రంగంలోని 54 రకాల కార్మికులు, పరోక్షంగా నిర్మాణ సామగ్రి యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. జిల్లాలో పంచాయతీ కార్మికులకు ఆరు నెలలుగా జీతాలు బకాయి ఉన్నాయని, వీరంతా ఎస్సీ, ఎస్టీ, బీసీ బడుగు బలహీన వర్గాలకు చెందినవారే ఉన్నారని తెలిపారు. బకాయిలు చెల్లించడంతో పాటు జీతాలను రూ.18 వేలకు పెంచాలన్నారు. మున్సిపల్ కార్మికులు, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, వీఓఏలు, ఆశా కార్యకులు, ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com